# మేనరికము తప్పలేదు

ప్రకాశరాయడు కాకినాడలో పేరుపొందిన ప్లీడరు. మంచి సంపాదన. పెద్దబజారులో నాతడు చక్కని మేడ కట్టెను. రొక్కము రెండులక్షలకు తక్కువ యుండదని వదంతి. దర్జాగలవాడు. భోగి. డబ్బు లక్ష్యములేదు. పొదుపుగా వాడియుండినచో ఏడెనిమిది లక్షల రొక్క ముండెడిదని యిరుగుపొరుగు వారు చెప్పుచుందురు.

ఒక్క కొడుకు ఒక్క కూతురును. రామారావు చాల చురుకైన వాడు. సిసింద్రీ అని చెప్పవచ్చును. సుందరమ్మ గూడ తెలివిగలదే; గాని అడకువ ఎక్కువ. ఈ కొడుకు నిమిత్తమును ప్రకాశరాయడు వేలకొలది ఖర్చు పెట్టెను. ఆతడు బ్రతికి యుండగా రామారావు బియ్యే పరీక్షలో నెగ్గెను. సుందరమ్మ నాలుగవ తరగతి మాత్రము చదివి బడి విడిచెను; గాని యింటివద్ద నామె చాల విజ్ఞానము నార్జించెను. అల్లిక పనులు నేర్చుకొనుమని తండ్రి చెప్పెను. ఇంగ్లీషు చదువుమని రామారావు చెప్పెను; గాని యామెకు వంటపనులమీద ఆసక్తి యధికము. జ్ఞానము వచ్చినది మొదలు ఆమె వంటగదిలో తల్లి చుట్టును తిరుగుచుండెడిది. ప్రకాశరాయడు ధనము చేరిన తరువాత వంటపని భార్యకు తప్పించి వంట బ్రాహ్మణుని ఏర్పటిచెను; గాని సుందరమ్మ పెద్దదయిన తరువాత వంటబ్రాహ్మణుని మానిపించి వంటలక్కను పెట్టించెను.

ఒకమాఱు వంటలక్క జ్వరము వచ్చి పడిపోయెను. పెండ్లిండ్ల కాలమగుటచే వంటకెవరును దొరుకలేదు. ప్రకాశరాయని భార్యకు వంటయిల్లనిన పెద్దపులిగా నుండెను. ఆతడు పదిగంటలకు కోర్టునకు వెళ్ళవలెను. ఏమిగతి? గుమాస్తాయు నాతడును కలిసి యోచించుచుండగా సుందరమ్మ వంటముగించి "నాన్నగారూ, భోజనానికి రండి" అని పిలిచెను. అందఱును తెల్లవోయిరి. వెనుకనే వచ్చి "చిట్టితల్లి మాట తక్కించింది" అని తల్లి నవ్వుచుబలికెను. భోజనమైన వెనుక ప్రకాశరాయడు పరమానంద భరితుడయి మహానందముతో పదికాసులు తెప్పించి చేతిలో పోసెను. అప్పటికామె వయస్సు పంద్రెండేండ్లు.

## 2

సుందరమ్మ రజస్వల యైనగాని వివాహము చేయగూడదని ప్రకాశరాయని యభిలాష; గాని యది యెప్పుడు నెవ్వరివద్దను బహిరంగము కాలేదు. కొమార్తకు పదవయేడు వచ్చిన తరువాత తల్లి యగు సుబ్బమ్మ "యీపాటికి అమ్మాయికి

సంబంధం చూడండి" అని చెప్పెను. అతని తల్లి "నాయనా, సుందరికి పెండ్లి యీడు వచ్చిందిరా" అని అదేపనిగ చెప్పజొచ్చెను. భార్యాపోరు గూడ హెచ్చుటవలన ప్రకాశరాయడు తన యభిలాషను తగ్గించుకొనియెను. ఇక్కడ ఇట్టి ప్రసంగములు జరుగుచున్నవని గాలి కబురు తెలిసి ఏలూరు నుండి సుందరమ్మ మేనత్త తన కొడుకును వెంట నిడుకొని వచ్చి "తమ్ముడూ, సుందరమ్మ నా కోడలు. పెళ్ళి ఎప్పుడు చేస్తావూ?" అని యడిగెను. "ఇప్పుడు తొందరేమిటమ్మా?" అని యప్పటికాతడు తప్పించుకొనియెను; గాని యా ప్రస్తావము మాత్రము తప్పలేదు. వాస్తవమున అతనికి మేనల్లుని మీద ఇష్టము లేదు. "నాదర్జా ముందు బావదర్జా యెంత అని యాతడనుకొనియెను. తల్లి మేనరికము తప్పదనియెను; భార్య మీ యిష్టమనియెను. సుందరమ్మ మేనత్తను పెనవేసికొని తిరుగసాగెను. మేనత్త యామె చేత తన కుమారునకు మంచినీళ్ళు కాఫీ మున్నగునవి యిప్పించుచుండెను; గాని ప్రకాశరాయడు మాత్రము ఆ సంబంధమున కంగీకరింపలేదు.

ఎన్నో రాయబారములు జరిగినవి. ఎన్నో రాద్ధాంత సిద్ధాంతములు జరిగినవి; గాని ప్రకాశ రాయడు పట్టిన పట్టు విడువలేదు. ఆతడన్నిటికిని సమాధానములు చెప్పెను. దగ్గరి వారందఱును "నీది మూర్ఖపట్టు" అని చెప్పిరి. "మేనరికం తప్పగూడదనిరి; గాని యాతని దొకటే మాట, "మేనరికం చెయ్య"నని యాతడు వ్రతము పట్టెను. విసిగి, అలగి ఆతని అక్క వెడలిపోయెను. నన్నేం చేయమంటావు వదినా అని సుబ్బమ్మ పలికెను. "ఏ చేస్తా మమ్మా! నీకొడుక్కి యేదో గంతకి తగిన బొంత దొరక్క పోదులే" అని తల్లి చెప్పెను. "అత్తయ్యా వెడతావా" అని సుందరమ్మ యడగగా, ఆమె తటాలున కౌగిలించుకొని కన్నుల నీరు పెట్టుకొని "యేం చెయ్యనే మరి మీ నాన్నకి మా భాగ్యాలు చాలేయి గాదు" అని చెప్పి మేనత్త వెళ్ళిన పిదప సుందరమ్మ మందు తిన్నట్లుండసాగెను. "అంత పట్టు పట్టగూడదండీ" అని సుబ్బమ్మ పలుకగా. "నీకు తెలవదు వూరుకో" అని ప్రకాశరాయడు ఖచ్చితముగా జెప్పెను.

## 3

పల్లెటూళ్ళలో వలె వారము దినముల వఱకు అదే పనిగ కాదు గాని మొత్తమునకు కాకినాడలో గూడ ఇరుగు పొరుగువారు సన్నాయి నొక్కులు మానలేదు. "ఏంలోటూ? ఆయన వర్తకుడు. కుఱ్ఱాడు చదువుకుంటున్నాడు. అందగాడు. ఇవ్వగూడదూ?" అని యొకతె యనెను. "ఆడబొడుచు ఉసూరుమంటూ వెడితే జయం కలగదు" యని యొకతె యనెను. "సుందరమ్మ చూపు అలాగే వుందే" అని యొక యువతి అనగా "పెళ్ళికూతురు యిష్టం యేమిటీ? మధ్యగా? ఇదంతా విపరీతం కాలము" అని ఆమె విదాళించుకొనియెను. "మధ్య నీ కెందుకు పోగాలమూ" అని పలికి ఆ యువతి వెడలిపోయెను. ఇంకను

వాదోపవాదములు జరిగెను. చనవు గల యొక వృద్ధాంగన అపత్తు వచ్చినపుడు వలె ప్రకాశరాయని తల్లిని పరామర్శ చేసెను.

సంబంధము నిశ్చయమైనది. ప్రకాశరాయుడు బందరు వెళ్ళి దువ్వూరి వేంకటావధానులు గారి కుమారుని నిశ్చయించుకొని వచ్చెను. కట్నము ఆఱువేలు. లాంఛనాల బాపతు మఱియొక వేయి. వరుని చిత్రపటమును చూచి సుందరమ్మ ఉత్సాహమును చూపలేదు సుబ్బమ్మ ఆనందమును చూపలేదు. వృద్ధురాలికి ఆ వార్త వినిన నాడు నోటికి అన్నము పోలేదు.

చైత్రశుద్ధవిదియనాడు రాత్రి నాలుగు గంటల వేళ వివాహమునకు ముహూర్తము స్థిరపడియెను. పనులు చాల చురుకుగా జరిగెను. ముహూర్తము సమీపించినది. బంధువులందఱును వచ్చిరి; గాని మేనత్త రాలేదు. ముసలమ్మ కన్నులనీరు పెట్టుకొనుట తరువాయిగా నుండెను. "ఒక్క ఆడబడుచు. ఇంకా రాలేదేమని అడుగుతున్నారు. సమాధానం చెప్పలేకుండా వున్నాను" అని సుబ్బమ్మ చెప్పగా ప్రకాశరాయుడు మొదట ఊరకుండెను. రెండవమాఱు గూడ నామె యడుగగా "నన్నేమి చేయమంటావు?" అనియెను. "తంతేనా కొట్టండి "" అని యామె చెప్పగా "యేడిసినట్లుగానే వుంది సరసం" అని యాతడు విదలించుకొనియెను. మంగళస్నానము నిమిత్తము తీసికొని వెళ్ళునపుడు సుందరమ్మ "అమ్మా అత్త రాలేదే" యనియెను.

సుబ్బమ్మ యందుల కతకని సమాధానమేదో చెప్పెను; గాని ఆమాట వెంటనే వీథిలో బడియెను. పెళ్ళికొడుకు తల్లి "అంత చనువు కాబోలు" అనియెను. "పిల్ల చూపు మేనత్త కొడుకు మీద వున్నట్లుంది. ఈ పిల్ల నాకు వద్దు" అని పెళ్ళికొడుకు అనియెను. ఆతనికి నచ్చచెప్పుటకు సన్నిహిత బంధువు లందఱును పనిచేయవలసి వచ్చెను. ఇరుగుపొరుగున వున్న ముసలమ్మలు వృద్ధురాలివద్ద కూర్చుండి యామె మాటలకు లయ వేయ సాగిరి. ఆమె మాటిమాటికిని ఆత్రముతో చూచుచు "ముడడిపోయిందా? నాకొడుక్కి నేనెంత పగ అయిపోయాను" అని యడుగుచుండగనే వివాహము పూర్తి అయ్యెను. ఆశీర్వచన సమయమున ఆమెకు అక్షతలు ఈయగా వానిని సుందరమ్మ మీద మాత్రమే వేసి దీవెంచెను.

పెండ్లి అంతయు ముగిసెను. సుందరమ్మ ముఖమున నెవ్వరును మందహాసమును గాని వికాసమును గాని చూడలేదు. సుబ్బమ్మ గూడ మందు తిన్నట్లు ఉండెను. ప్రకాశరాయని ముఖము ధుమధుమలాడుచుండెను.

మనుగుడుపులయిన తరువాత సుందరమ్మ ఒక్కతియే యొకచో గూర్చుండి యుండగా వృద్ధురాలు అక్కడకు వచ్చి "చలపతి నీకు పనికివచ్చేడు కాదుటే అమ్మా" అనియెను. సుందరమ్మ దానికి జవాబు చెప్పలేదు. నిజముగా నామె చెప్పలేకపోయినది. చూచుచుండగా కన్నులనీరు దిరుగగా నామె నాయనమ్మ మీద

పడి దు:ఖింపసాగెను. ఇరువురును కొంత తడవు దు:ఖించిన తరువాత ఇతరులు తమ్ము చూచునప్పటికి ఎట్లో విచారమును దిగమ్రింగుకొనిరి.

## 4

సుందరమ్మ సుందరియే; గాని సౌందర్యమునకు అలంకారమగు ఆనందము తక్కువ అయ్యెను. పెళ్ళిలో అత్తవారు నాలుగు వేల రూపాయల నగలు పెట్టిరి; గాని పండుగలలో గూడ వాని నన్నిటిని ఆమె ధరించుటలేదు. ప్రకాశరాయడు "జడ యేది తల్లీ?" యనిన ఆమె "బలువు నాన్నా" యనును. "కాసుల పేరు ఏదమ్మా" యనిన "రోజూ యెందుకూ?" యనును. "అన్ని వస్తువులు వక్కమాటు పెట్టుకో చూస్తాను" అనిన "పండుగ నాడు పెట్టుకుంటానులే" యనును.

ఆమె భర్త సంక్రాంతి పండుగునకు వచ్చి చీనాంబరములు కట్టుకొనివెళ్ళిన నాడే యామె రజస్వల యయ్యెను. తాత్కాలికములగు వేడుకలన్నియు ముగిసినవి. నక్షత్రము మంచిది గాకపోయెను. "ఆఱు మాసాలు వధూవరులు ఒకరిని వకళ్ళు చూసుకోగూడదు" అని సిద్ధాంతి చెప్పెను. ఈ వార్త విని ఆమె భర్త బి.యే. పరీక్షకు చదువుటకు మదరాసు వెళ్ళెను. ప్రకాశరాయడు తన కుమారుని గూడఆతనితో పంపించెను. ఇద్దఱిదియు ఒకటే తరగతి. వయసుగూడనొకటే.

వారు చెన్న పట్టణము ప్రవేశించి నాలుగు మాసాలైనది. తంబుచెట్టి వీధి యందలి క్రిష్టియను కాలేజీ యొక్క వసతి గృహమున వారు మకాము చేసి యుండిరి. అది నగరము. వారు ధనికులు. వారు ఒక్కొక్కరు నలుగురు విద్యార్థులకు సరిపడు సొమ్ము వాడుచుండిరి.

ఇరువురును సాయంకాలము అయిదు గంటలకు సైకిళ్ళెక్కి తిరువల్లిక్కేణి సముద్ర తీరమునకు యథాపూర్వముగ బోయిరి. ప్రకృతి సౌందర్యమనిన రామారావునకు అత్యానందము. సముద్రతీరమునకు వెళ్ళినపుడెల్ల సుందరమ్మ భర్త సెనేటి మందిరమును జూచి "మన జయాపజయాలు యిందులో వున్నాయి" అనుచుండును. రామారావు అందుల కంగీకరింపక, "దానియెడల మనకంత భయభక్తులు వుండనక్కర్లేదు. మన చదువుని అది తూస్తుంది. మన విజ్ఞానాన్ని లోకము పరీక్షింస్తుంది." అని ప్రత్యుత్తర మిచ్చుచుండను; గాని నేడు వారట్టి ప్రసంగము లేమియు జేయలేదు. రామారావు సముద్రపు నీటివద్దకు బోయి కూర్చుండెను. సుందరమ్మ భర్త కాముక పథమున గూర్చుండెను.

ఏడుగంటలయిన తరువాత ఇరువురును గలిసి బయలుదేరిరి. పండువెన్నెలలో సైకిలు చక్రముల ధావళ్యము విద్యుత్పరివేషములను గట్టు చుండెను. గంటలు గణగణ మ్రోయుచుండెను. కార్బైడు దీపములు వెన్నెల వలనను, విద్యుద్దీపికల ప్రకాశము వలనను అంత తేజస్వంతముగ లేకున్నను దర్శనీయములుగనే యుండెను.

హైకోర్టును సమీపించునప్పటికి అమాంతముగ నొక జ్యోతిస్తరంగము వచ్చి రామారావునకు నేత్రావరోధము గలిగించెను. కండ్లు చీకటులు క్రమ్ముటవలన అతడు బండి దిగి నిలువబడెను.

ఇంతలో సముద్రములో ధామ్మని కడుపు బ్రద్దలగునట్లు పెద్ద ధ్వని యయ్యెను. ఆ ధ్వని వెంటనే హైకోర్టు మీది గుమ్మీ యొకటి కూలి పడియెను. ప్రహరీగోడ గూడ కొంతవఱకును బడిపోయెను. రామారావు ఒక్క గంతులో ముందునకు వచ్చి చూడగా సుందరమ్మ భర్త క్రిందబడి రక్త ప్రవాహమున దొరలుచుండెను. ఇక్కడ రామారావు హృదయము అతివేగముగ కొట్టుకొనుచుండగా సముద్రమునందును, తీరమునందును ధాంధామ్మని ఫిఱంగులు మ్రోయసాగెను. రామారావు జట్కా యెక్కించి బావమఱదిని ఆసుపత్రికి తీసికొనిపోయెను.

మఱునాడు జర్మనీ వారి... క్రూయిజరు వచ్చి అల్లరిచేసి పోయెనని పత్రికలు ప్రకటించినవి. "మీ అబ్బాయి గుండుదెబ్బ తిని చచ్చిపోయె"నని రామారావు బందరు దువ్వూరి వెంకటావధానికి తంతిగొట్టెను. ఈసంగతి నాతడు కాకినాడ గూడ తెలిపెను.

## 5

కాపురమునకు వెళ్ళుటకు సిద్ధముగ నున్న కొమార్తకు భర్తృవియోగము. సుబ్బమ్మ విచారింపకపోలేదు; గాని ఆమె యందు కొంచెము వైరాగ్యము ప్రతిఫలించుచుండెను. ముసలమ్మ సుందరమ్మ దెసకు జూచి సన్నసన్నముగ నేడ్చెను. సుందరమ్మ గూడ విచారించెను; గాని యిరుగు పొరుగు వారు కొందఱు "చిన్నపిల్లమ్మా, దానికేం తెలుసునూ అభమూ శుభమూను? మొగుడి మొఘం యెరగదాయె" అనుకొనిరి.

ప్రకాశరాయడు అంతయు జూచి తాను చేసిన పనికి అందఱును ఇప్పటికి గూడ వ్యతిరేకాభిప్రాయముతోడనే యుండుట గమనించి "నేను మూర్ఖపు పట్టు పట్టేనా?" అనుకొనియెను.

చాలునిది. చేవదూలమున కీటకము ప్రవేశించినది. "అమ్మాయి బతుకు నేనే బుగ్గి చేశానా? యిలా అవుతుందనుకోలేదు. అతను బతికి వుంటే అంతా స్పష్టంగా తెలిసివుండును" అని ప్రకాశరాయ డనుకొనుచుండగా సుబ్బమ్మ వచ్చి "బతుకు బగ్గంపాడయిపోయింది. చూస్తూ చూస్తూ పిల్ల గొంతుకోసుకున్నాము" అనియెను. ప్రకాశరాయనికి గోరుచుట్టుమీద రోకటిపోటు పడినట్లయ్యెను.

సుందరమ్మ యెదురొమ్ముమీది కుంపటివలె నుండెను. ఒక్క కూతురు. గారాలకూచి. పైగా పెళ్ళి విషయమున తన పట్టుదల. ప్రకాశరాయనికి తల తిరిగిపోయెను. మంగళ స్నానమునకు వెళ్ళుచు సుందరమ్మ పలికిన "అమ్మా, అత్తరాలేదే" యను మాట మీద ప్రవర్తిల్లిన గందరగోళమంతయు నాతనికిప్పుడు

నెమరునకు వచ్చెను. భావము విస్పష్టముగనే యున్నది. గాంభీర్యమేమియు లేదు. అతనికి క్షణక్షణము ఎవరో వెన్నుతట్టి "పట్టుపట్టి పిల్ల గొంతుకోశావు. చెబితే విన్నావా?" అని యడుగుచున్నట్లు తోచుచుండెను.

తలనొప్పితో ప్రారంభమైన మనోవ్యధ ప్రబలిపోగా ప్రకాశరాయడు కోర్టునకు వెళ్ళుట మానివేసెను. సుందరమ్మ మేడమీద ఏమూలనో పడియుండును. సుబ్బమ్మ పలుకరింపదు. ముసలమ్మ మూల్గు అధికమయ్యెను. ప్రకాశరాయనికి చీమలును జెఱ్ఱిలును ప్రాకినట్లు ఉండెను.

యుక్తసమయమున ఈ వార్త తెలువగా సుందరమ్మ మేనత్తయగు సోదెమ్మ భర్తతో గూడ వచ్చి పరామర్శ చేసెను. అందఱును మితభాషులై యుండిరి. సోదెమ్మ కలిపి ముందు ఉంచగా సుందరమ్మ మాట్లాడకుండ అన్నము తినియెను. ఈ సంగతి సుబ్బమ్మ చెప్పగా ప్రకాశరాయడు, "పాపాత్ముణ్ణి నేను బుద్ధిపూర్వకంగా అమ్మాయికి తీరని అపచారం చేశాను" అని తహతహపడెను.

దినములు గడచిపోయినవి. "పదోనాటికేనా తీసుగురావలసినద"ని బందరునుండి జాబు వచ్చినది.; గాని ప్రకాశరాయడు దానికి జవాబు వ్రాయలేదు. మఱి నాలుగు దినములుండి సోదెమ్మ ప్రయాణము మాటయెత్తగా సుందరమ్మ గొల్లుమనియెను. సుబ్బమ్మ "యెలా వెడతావు వదినా" అనియెను.

## 6

"చాలా బాగా రాశానురా! ఈశ్వర కటాక్షం వుండాలి యిక" అని నాలుగుగంటల ప్రొద్దువేళ అప్పుడే ప్రశ్నపత్రములకు జవాబు వ్రాసివచ్చి రామారావు మిత్రునితో చెప్పుచుండగా కాకినాడనుండి తంతి వచ్చెను. విప్పి చూడగా "మీ నాన్న బ్రతికే ఆశలేదు. తక్షణం బయలుదేరు" అనియుండెను.

కాళ్ళును చేతులును వడకుచుండగా మిత్రుని సాహాయ్యమున సామానంతయు వేయించుకొని మఱుసటి దినము ఉదయము తొమ్మిది గంటలకు మెయిలు దిగి రామారావు యింటికి వచ్చెను. ఆతడు గుమ్మములో అడుగు బెట్టునప్పటికి ప్రకాశరాయడు కొమార్తను ప్రక్కలో గూర్చుండ బెట్టుకొని ఆమె రెండుచేతులును పట్టుకొని "తల్లీ, నన్ను క్షమించు. నీ జీవితాన్ని అంధకారబంధురంగా చేశాను. నాకీ పాపానికి ప్రాయశ్చిత్తం లేదు" అని చెప్పుచుండెను.

రామారావు మంచము వద్ద మోకారించి యుండెను. సుందరమ్మ మంచము మీదనే యుండెను. సుబ్బమ్మ మంచమునకు రెండవదెస కూర్చుండి యుండెను. సోదెమ్మ తల్లింపున నిలిచి యుండెను. ముసలమ్మ గుమ్మములో కూర్చుండి కన్నుల నీరు పెట్టుకొనుచుండెను.

"అమ్మాయి విషయంలో నా పాపం అపరిమితమై వుంది. ముందేమి చేసి వుందునో? యిప్పుడెందుకూ అదీ?"

"అధైర్యపడకండి"

"వక్కటే ధైర్యం: కావలిసింది కాకమానదు నాకు. అయినా చెల్లాయిని నువ్వెలా చూస్తావో చెప్పూ"

"ఆమె యెలా నడవమంటే అలా నడుస్తాను."

"దాని దు:ఖం పోగొట్టగలవా?"

"మీ సెలవుకోసం చూస్తున్నాను. మూడు మాసాలనుంచి నాకదే ఆలోచన"

"వీరేశలింగం పంతులుగారు నా స్నేహితులు. వారి వుపదేశం అనుసరించు"

"చెల్లాయి యిష్టం అని చెప్పేను కాదూ?"

"మొలలోతు దు:ఖంలో మోకాలిలోతు సంతోషం. అమ్మా, క్షమించు, సెలవు. అబ్బాయీ, నీకు లోటు లేదు. జాగర్త"

ఇట్లు చెప్పి ప్రకాశరాయడు మఱి పలుకలేదు.

## 7

"పోతూపోతూ మీనాన్న యేమిటిరా చెప్పేరు నాయనా!"

"చెల్లాయి మాట"

"అంటే"

"ఆమె భవిష్యత్తును గుఱించీ"

"ఏమన్నారూ?"

"ఆమె యేమి కావాలంటే అది చెయ్యమన్నారు"

"వీరేశలింగం గారన్నారేమిటీ?"

"అదే; చెల్లాయిని మళ్ళీ నలుగురిలో సుఖంగా వుండేలాగ చెయ్యమనీ"

"అంటే?"

"పునర్వివాహం అన్నమాట"

సుబ్బమ్మ మాఱు పలుకలేదు. రామారావు సుందరమ్మను తీసికొని మేడమీదికి పోయెను.

మఱునాడు ముసలమ్మ గూడ ఇట్లే యడుగగా రామారావు యిట్లే సమాధానము చెప్పెను.

"వ్యవహారపు తొందర మీద చెన్నపట్టం వెడుతున్నాను. చలపతి షాపులో వుండాలి. అంతా నీకు తెలిసే వుంది. మీ అత్తని తీసుగువచ్చి దిగబెడితే

సంతోషిస్తాను" అని సోదెమ్మ భర్త వ్రాసిన జాబును రామారావు తల్లి చేతికిచ్చెను. సుబ్బమ్మ సుందరమ్మ కిచ్చెను. సుందరమ్మ దానిని సోదెమ్మ మీద పడవేసి కౌగలించుకొని "అత్తా, పదిరోజులుండవూ?" అనియెను.

సుందరమ్మను నిద్రపుచ్చి ముసలమ్మయు సోదెమ్మయు కూర్చుండిరి. అప్పటికప్పుడే సుబ్బమ్మ నిద్రలో నుండెను. రామారావు క్రింద గుమాస్తాతో మాట్లాడుచుండెను.

"తెలిసిందా?"

"లోకం హర్షిస్తుందా?"

"అంతా యేం చేస్తున్నారూ?"

"కావలిసిన వాళ్ళలో కొందరు దూర మౌతారు."

"అయితే యేం నష్టమూ?"

"ఏముందీ?"

"పిల్ల రత్నం వంటిది."

"కాని- రెండో-"

"నాకిబ్బంది లేదు. మీ అల్లుడు వప్పుకుంటారు. అబ్బాయి మాట చూడాలి. వదిన వూహ యేమిటో?"

"గందరగోళం చెయ్యడం లేదు."

"ఆశగానే వుంది నాకు."

"నీ మాట నిశ్చయమే?"

"ఇంకా నింపాదిగా అదుగుతావా?"

"దిక్కుమాలిన లోకం. యిష్టం లేని పెళ్ళి చేస్తే యెవరూ యేమీ అన్న పాపాన్ని పోలేదు. ఇది చేస్తే తమ కొంపలు మునిగిపోయినట్లు యేదుస్తారు."

"ఆ యేడుపే వాళ్ళకి తక్కుతుంది"

"రాముడు మంచివాడే. అయితే నీకొడుకుకే యిస్తాడన్నమాటేమిటీ?

"పెళ్ళి ఆడడం అంటూ వస్తే సుందరి మరొకణ్ణి పెళ్ళాడుతుందా?"

"యేమో"

"అలాకాదు. కదిపి చూస్తా కాదూ?"

## 8

తెల్లవారుజామున ముసలమ్మ లేచి క్రిందికి పోయెను. సుబ్బమ్మ "వుక్కగా వుంద"ని డాబా మీదికి పోయెను. సోదెమ్మ కూర్చుండి యుండగా "కూచున్నావేం అత్తా?" అనుచు సుందరమ్మ వచ్చి ఆమె చెంత గూర్చుండెను.

ఇటు ప్లీడరు కూతురు, అటు ప్లీడరు అక్కయును. వారి సంభాషణము మిగుల గడుసుదనముగా ప్రారంభమయ్యెను.

ఎనిమిది గంటల ప్రొద్దెక్కిన తరువాత ముసలమ్మ నూతివద్ద స్నానము చేయుచుండగా సోదెమ్మ వచ్చి "కోటలో పాగా వేశాను" అని చెప్పి వెడలిపోయెను.

## 9

రామారావు వాలుకుర్చీ మీద పడుకొని చదువుకొనుచుండగా సుబ్బమ్మ వచ్చి యెదుట నున్న కుర్చీ పీట మీద కూర్చుండెను. రామారావు సుందరమ్మ ప్రస్తావము తెచ్చెను.

"ఏముంటుందీ?"

"నాన్న చెప్పిందేమిటని అడిగింది."

"తరవాతా?"

"మీ యిష్టం అంది."

"మీ అంటే?"

"మనం అందరమూనూ."

"మీ నాయనమ్మ–"

"ఆవిడ లెక్క యేమిటి? బాధ్యత లేనిదని కాదు. పూర్వకాలం మనిషి."

"కొట్టెయ్యడమే ఆవిడ మాట?"

"అవసరమైతే అలాగే."

"అడిగి చూడూ."

"నువ్వో?"

"సుందరమ్మ బతికివుంటే చాలు."

ఇట్లు చెప్పి సుబ్బమ్మ లేవగా "కూచో" అని రామారావు యిట్లు చెప్పెను.

"సమయానికి అత్త యిక్కడ వుండడం మంచిదే అయింది. అత్తా, నాయనమ్మా అంతా ఆలోచించుకున్నారు. అత్తకి యిష్టం పూర్తిగా వుంది. ముసలిది తటపటాయిస్తోంది, అత్త సాహసిస్తే మాత్రం అడ్డుపెట్టదు. వెట్టివెట్టి లౌక్యాలతో లాభం యేమిటీ? చెల్లాయిని నీ యెదటికి తీసుకు వచ్చి అంతా వప్పిస్తాను. ఆమెకి సుఖం కలిగించడం కంటే ఆమెకు నేను చేయగలిగినట్టిన్నీ, నా జీవితంలో నేను చేయదగినట్టిన్నీ మంచిపని మరి లేదు. నాన్న బందరు సంబంధం తేవక ముందునుంచీ కూడా చెల్లాయి చలపతి మీద ఆశపెట్టుకుని వుంది. నాన్నగారికి దూరాలోచన లేకపోయింది గాని చలపతి మాత్రం లేనివాడా? కానివాడా? మెట్రిక్కులేషన్‌తో చదువు కట్టిపెట్టినా వర్తకంలో ఆరితేరాడు. బియ్యే

పరీక్షలో నెగ్గినా నేను నౌకరీ చేసి సంపాదించే దానికంటే ఆతను కూచుని సంపాదించేదే యెక్కువగా వుంటుంది., పైగా సరసుడు. చెల్లాయి దాటిపోయినందుకు విచారిస్తూ యిప్పటిదాకా పెళ్ళాడకుండా వున్నాడు. చెల్లాయికి మళ్ళీ పెళ్ళి చెయ్యడంలో ఆమెను చలపతికి యివ్వకపోతే యిక లోకంలో అంతకంటే ఘోరం వుండదు. నువ్వు మాత్రం దీనికి అభ్యంతరం చెప్పడం యెందుకూ-?"

"నేనేం చెప్పడం లేదు. ఘోరకలిగా వుంటుందేమో-"

"అదే తెలివి తక్కువ"

"వక్క కొడుకూ, వొక్క కూతురూనూ. మీరు పచ్చగానూ, చల్లగానూ వుంటే చూడలేకనా? అయినా కాలం మునుపటిలా లేదు. మనల్ని యెవరూ యేమీ చెయ్యలేరు. నీ పెళ్ళి అడ్డుగూడా తీరిపోతే బాగుండును."

"మద్రాసులో నన్ను వక ప్లీడరు గారు వచ్చి చూసి వెళ్ళేరు; చిన్నపిల్లని యిస్తామన్నారు. పన్నెండో యేడుట. పెద్దపిల్ల వితంతువయింది. వయస్సు పద్ధానుగేళ్ళు, ముడిపడ్డ మూడోమాసంలో పోయాడు మొగుడు. ఆపిల్ల నిస్తారా అని కబురంపేను."

"నువ్వు గూడా అలాంటి పెళ్ళే?"

"ఏం లోటూ?"

"అచ్చటా, ముచ్చటా-"

"అన్నీ మామూలుగా తీరితేనే"

సుబ్బమ్మ మాట్లాడకుండ వెడలిపోయెను.

## 10

సాయంత్రము అయిదు గంటల వేళ సుబ్బమ్మ సుందరమ్మను తీసికొని డాబా మీదికి పోయి కూర్చుండి నింపాదిగా అడిగెను. సుందరమ్మ మొదట జవాబు చెప్పలేదు. కొంతసేపటికి అన్నయ్య "పెళ్ళాడతావా అని అడిగేడ"నియెను. మఱల అడుగగా "నాన్న గారు చెయ్యమన్నారుట" అనియెను. మఱల గ్రుచ్చిగ్రుచ్చి అడుగగా "నీ యిష్టం" అనియెను. "అయితే యెవర్ని పెళ్ళాడతావూ" అనగా సుందరమ్మ వెంటనే "చలపతి బావని" అనియెను.

సుబ్బమ్మకు దు:ఖము వచ్చెను. "బుద్ధి పూర్వకంగా నీ గొంతుకోశాము. సుఖపడమ్మా" అని యామెను కౌగలించుకొని క్రిందికి తీసికొని పోయెను.

## 11

అంతయు నిశ్చయమయెను. ముహూర్తము స్థిరపడెను. సోదెమ్మ మహానందముతో ఏలూరు వెడలిపోయెను.

"నీ యిష్టం అన్నారు రామచంద్రరావు గారు" అని మదరాసు నుండి మిత్రుడు వ్రాయగా రామారావు వెంటనే వెళ్ళి పెళ్ళి నిశ్చయము చేసికొని వచ్చెను. యిష్టపడిన బంధువులను, వీరేశలింగము పంతులుగారిని, తీసికొని వెళ్ళి యాతడు కోరుకొనిన వితంతువును పెండ్లియాడి వచ్చెను. మఱి పదిదినములకు సుందరమ్మ పెళ్ళి, రామారావు నవ వధువుతో పీటలమీద కూర్చుండి కాళ్ళు కడిగి చలపతికి సుందరమ్మను ఇచ్చి వివాహము గావించెను.

❀ ❀ ❀